క్లుప్తంగా

ఘనంగా గోపాలదాస ఆరాధన



అలంకరణలో మంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలసిన మంగరాయ సన్నిధిలో బుధవారం గోపాలదాస వారి ఆరాధనోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ మేనేజర్ క్రొప్రేష్ ఆచార్ ఆధ్వర్యంలో మంగరాయ ఆంజనేయ స్వామికి ఫల పంచామృతాభిషేకం, బెంగళూరు నుంచి తెచ్చిన పూలతో అలంకరణ,నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాస సాహిత్య పండితుడు గోపాలదాస విగ్రహానికి ప్రత్యేక పూల అలంకరణ చేసి పూజలు చేశారు. అదేవిధంగా గోపాలదాస విగ్రహంతో మంగరాయ ఆంజనేయస్వామి చుట్టూ రథోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. పూజారులు గురురాజ ఆచారి, అక్షయ్ పాల్గొన్నారు.

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు



కల్లుమఠం పీఠాధిపతిని సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: ప్రపంచానికి శ్రీరాముడు ఆదర్శమని కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధ మహాస్వాములు అన్నారు. అయోధ్య శ్రీరాముడి ప్రతిష్టాపన చేసిన దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక గణేష్ సర్కిల్‌లో ఉత్సవం జరిగింది. ముందుగా రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి, ఆ తర్వాత డోలు సన్నాయిల మధ్య గణేష్ సర్కిల్‌కు చేరుకున్నారు. ముఖ్య అతిథిగా గురుసిద్ధస్వామి పాల్గొని శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రామాయణం గురించి ప్రసంగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు శివకుమార్, నాగరాజు, సురేష్, సత్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డును నిర్మించాలి



మున్సిపల్ కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో చర్చి వెనుక లైన్‌తో పాటు పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్డును నిర్మించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చిన్నిప్రసాద్, నాయకులు పీడీ ఏసు, విజయ్, ఎల్లప్ప, నవీన్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చి కాలనీలోని సమస్యలను వివరించారు. రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు కమిషనర్ దృష్టికి తెచ్చారు. అదేవిధంగా కలుగొట్ల రోడ్డులోని లెదర్ గోదాముల సర్కిల్ వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. లైట్లు లేకపోవడంతో ఆ ప్రాంతంలో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు.

మంత్రాలయం ఎస్‌ఐగా శివాంజల్



మంత్రాలయం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా శివాంజల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ పరమేష్‌నాయక్‌ను ఎస్పీ ఆఫీసులో రిపోర్టు చేసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా నుంచి శివాంజల్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఉదయం బాధ్యతలు చేపట్టి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంత్రాలయం పవిత్రత కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన ఆయన పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపిక సరళి విధులపై కర్నూలు వెళ్లారు.

25న జాబ్‌మేళా

ఆదోని రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నాక్ శిక్షణ కేంద్రంలో ఈ నెల 25వ తేదీన నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎల్. ఆనంద్‌రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగమేళాలో బహుళ జాతీయ కంపెనీలు వికాస, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, బీఎంఎస్ సెక్యూరిటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొనడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన వారు అర్హులని, 18- 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం పొందుతారన్నారు. అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 91774 13642 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మైనర్ల దూకుడు

పిల్లలకు ఎలాంటి లోటు రానివ్వకూడదనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వారికి ద్విచక్ర వాహనాలను కూడా ఇస్తున్నారు. అయితే రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన లేని మైనర్లు అతివేగంగా వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు ప్రాణాలు కూడా కోల్పోయిన దాఖలాలు ఉన్నాయి. వాహనాన్ని నియంత్రించే సామర్థ్యం లేకున్నా రోడ్డెక్కి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. అలాగే మైనర్ డ్రైవింగ్‌తో అవతలి వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి.

- ద్విచక్ర వాహనాలతో మైనర్ల హల్‌చల్
- బైక్‌లను నియంత్రించే సామర్థ్యం లేకపోయినా అతివేగంతో ప్రయాణం
- స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడుతున్న వైనం
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం శూన్యం



గోనెగండ్లలో ప్రమాదకర ప్రాంతాలను గుర్తిస్తున్న ఎంవీఐ కె.శిరీష, సీఐ గంగాధర్ (ఫైల్)

గోనెగండ్ల: ఇటీవల కాలంలో మైనర్లు ఎక్కడ చూసినా రయ్.. రయ్ మంటూ బైక్‌లపై దూసుకుపోతున్నారు. తగిన వయసు లేకుండానే వాహనాలను యమ స్పీడ్‌గా నడుపుతున్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్విచక్ర వాహనాలను నడపటం నేర్పించగానే, వారే స్వయంగా వాహనాన్ని నడిపేలా ప్రోత్సహించడం కూడా ప్రమాదాలకు కారణంగా మారుతోంది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో వారికి తెలియకుండానే మైనర్లు బైక్‌లను తీసుకెళ్లడంతో తరచూ ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొంతమంది గాయాలతో బయట పడుతుండగా.. మరికొందరు శాశ్వత వైకల్యం బారిన పడుతున్నారు. కొన్ని ఘటనలో మైనర్లు ప్రాణాలను కూడా కోల్పోతుండటంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంటోంది.

గోనెగండ్ల మండలంలో పలువురు మైనర్లు రోడ్లపై వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నారు. గత ఆరు నెలల్లో దాదాపు 100 మంది మైనర్లు పట్టుబడినట్లు పోలీసులు తెలుపుతున్నారు.

చట్టం ఏం చెబుతోందంటే..

మోటారు వాహన చట్టం ప్రకారం 18 ఏళ్ల వయసు నిండిన వారు గేర్లు లేని సాధారణ వాహనం నడిపేందుకు అవకాశం ఉంది. అలాగే 18 ఏళ్లు నిండిన తర్వాతే డ్రైవింగ్ అనుమతి పొందడానికి ఇతర వాహనాలు నడిపేందుకు చట్టం అంగీకరిస్తుంది. వయో అర్హత ఉన్న వారికి రవాణా శాఖ ఆధ్వర్యంలో తగిన పరీక్షలు నిర్వహించిన అనంతరం డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. మైనర్ వాహనం నడుపుతూ పట్టుబడితే చట్టపరంగా శిక్షకు అర్హుడే. అదే సమయంలో వాహన యజమానిపైనా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంది. నిబంధనలపై చైతన్యం, అవగాహన లేక ద్విచక్ర వాహనాలపై మైనర్లు రోడ్లపై చక్కర్లు కొడుతూ స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడుతున్నారు.

వద్దని వారించే వారేరీ?

రహదారి నిబంధనలు కఠినంగానే ఉన్నా.. వాటి అమలు మాత్రం నీరుగారుతోంది. పిల్లలు వాహనాలు నడుపుతుంటే చూసి ముచ్చటపడే కుటుంబ సభ్యులు ఉన్నారే తప్ప వద్దని వారించే వారు చాలా తక్కువ. పాఠశాల స్థాయి విద్యార్థులు ద్విచక్ర వాహనాలను రద్దీ రోడ్లపై నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అంచనా వేయవచ్చు.

అవగాహన కల్పిస్తున్నప్పటికీ..

పోలీసులు తరచూ వాహన తనిఖీలు చేస్తూ పట్టుబడిన వారికీ అవగాహన కల్పిస్తున్నారు. మైనర్లు వాహనం నడపొద్దు.. ఎవరైనా పట్టుబడితే సంబంధిత వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటాలంటూ పోలీసులు హెచ్చరిస్తూనే ఉన్నారు. వాహన యజమానులు, బాలల కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా, పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదు.

తల్లిదండ్రులదే బాధ్యత



నిబంధనల ప్రకారం 18 ఏళ్లు దాటిన వ్యక్తి కూడా డ్రైవింగ్ లైసెన్స్ పొందకుండా వాహనం నడిపేందుకు వీలు లేదు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత. పిల్లలపై పెద్దలు నిరంతర నిఘా ఉంచాలి. తగిన వయసు వచ్చేంత వరకు పొరపాటున కూడా వారికి డ్రైవింగ్ నేర్పించకూడదు. చిన్నతనంలోనే ఖరీదైన వాహనాలు ఇప్పిస్తుండటంతో అధిక శాతం మంది ప్రమాదాల బారిన పడుతున్నారు.

– ఏ. గంగాధర్, సీఐ, గోనెగండ్ల

సొంత గ్రామాల్లోనే ఉపాధి కల్పిస్తాం

పెద్దకడబూరు: గ్రామాల్లో పనులు లేవని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లొద్దని, వ్యవసాయ కూలీలకు సొంత గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీడీ లోకేశ్వర్ సూచించారు. మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో బుధవారం ఏపీఓ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో కూలీలకు వలస వెళ్లొద్దని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడిగిన వారందరికీ పనులు కల్పించేందుకు ఎన్‌ఆర్ ఈజీఎస్ తరఫున సిద్ధంగా ఉన్నామన్నారు. పనికి తగ్గ వేతనం రోజుకు రూ.300 వరకు పొందవచ్చని చెప్పారు. ఉన్న గ్రామంలోనే ఉపాధి పనులు చేసుకోవాలని, వలస వెళ్లి ఇబ్బంది పడవద్దని సూచించారు. ఉపాధి సిబ్బంది ఉన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

కౌతాళం: ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పట్టు, బ్యాంక్, మార్కెటింగ్ తదితర సంస్థలతో చర్చించి ప్రతి గ్రామంలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దేవదాయ, ధర్మదాయ, వక్ఫ్ బోర్డుకు సంబంధించి సుమారు 4 లక్షల ఎకరాల భూమి ఉందని. ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్న రైతులకు గుర్తింపు కార్డులు, రైతు భరోసా, పంట రుణాలు, పెట్టుబడి రాయితీ, పంటల బీమా అందించాలని కోరారు. ప్రతి కౌలు రైతుకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి



నదికైరవాడిలో రీసర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

నందవరం: గ్రామాల్లో చేపట్టిన రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామ సచివాలయంలో తహసీల్దార్, సర్వే అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రైతులు అందుబాటులో ఉండి రీసర్వేకు సహకరించాలన్నారు. భూ సమస్యలు పూర్తిగా ఈ సర్వేతో తొలగిపోతాయన్నారు. నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేయాలని సర్వే అధికారులకు, సిబ్బందికి సూచించారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వే చేసి భూముల విస్తీర్ణం, కొలతలు, సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. రైతులు ఈ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డీప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, రీసర్వే ఉప తహసీల్దార్ మహేష్, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎల్‌టీపీలకే అవకాశం కల్పించాలి



చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎల్‌టీపీలు

ఆదోని టౌన్: భవన నిర్మాణాల మంజూరు కోసం ప్లాన్‌లను వేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం కోసం స్థానిక ఎల్‌టీపీ (లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్)లకే అవకాశం కల్పించాలని ఆదోని మున్సిపాలిటీ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం డీఎల్‌పీఓ నూర్జహాన్, మండిగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌లను కోరారు. వారు బుధవారం మాట్లాడుతూ..ఇతర ప్రాంతాలకు సంబంధించిన వారి లాగిన్‌లలో ఈ ప్రాంతంలోని ప్లాన్‌లు అప్‌లోడ్ అవుతుండడంతో స్థానిక ఎల్‌టీపీలు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ కొత్త జీఓ ప్రకారం కుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)లో లైసెన్స్ పొందిన వారు జిల్లాలో ఏ ప్రాంతంలో అయినా ప్లాన్‌లను వేసే అవకాశం ఇకపై ఉండదన్నారు. వీరి లాగిన్‌లను రద్దు చేయాలని ఎల్‌టీపీలు కోరారు. ఆ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న నాగేశ్వరరావు

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆరెకటికె నాగేశ్వరరావుకు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ఈయన రెండు వేలకు పైగా వచన కవితలు రాశారు. అలాగే నాలుగు పుస్తకాలు రచించారు. ఈయన తెలుగు భాషకు చేస్తున్న సేవలకు గాను పురస్కారం వరించింది. ఈనెల 21వ తేదీ శ్రీ కొత పూర్ణానంద్ విలాస్ కళావేదిక విజయవాడలో శ్రీ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేదికలో కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణ, ప్రధాన కార్యదర్శి పార్థసారథి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను బుధవారం స్థానిక ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి దస్తగిరి స్వామి ఉరుసు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో హజరత్ సయ్యద్ శ్రీ దస్తగిరి స్వాముల ఉరుసు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయని గ్రామ పెద్దలు, గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంత రెడ్డి, సర్పంచ్ మద్దీశ్వరి, వైస్ ఎంపీపీ షేక్‌సాహెబ్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 23న గంధం, 24న ఉరుసు, 25న జియారత్ కార్యక్రమాలను నిర్వహించనున్నామని, భక్తులు తరలివచ్చి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

మాచాపురంలో పశు వైద్య శిబిరం



శిబిరంలో డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు

నందవరం: మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో పశు వైద్యాధికారులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బుధవారం గ్రామంలో వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి టీకాలు వేశారు. అనంతరం గేదెలకు చూడి పరీక్షలు, ఎద టీకాలు వేశారు. పాడి రైతులకు దాణా, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంతో పాటు రైతులు పాడి పోషణలో రాణించాలన్నారు. పాడి పశువుల ద్వారా ఆదాయం పెంచుకుని అభివృద్ధి సాధించాలన్నారు. గొర్రెలు, పొట్టేళ్లలో నట్టల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గొర్రెల పెంపకంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సరైన సమయాల్లో టీకాలు వేయించాలన్నారు. ప్రస్తుతం ఆవులు, గేదెలకు రోగ నిరోధక శక్తి తగ్గి పాల దిగుబడి తగ్గుతుందన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించాలని సూచించారు. జూనియర్ వెటర్నరీ డాక్టర్ గిరిప్రసాద్, ఏహెచ్‌ఏలు శ్రీదేవి, సంధ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రైతన్న డైరీ ఆవిష్కరణ



రైతన్న డైరీ, రైతు లోకం మాసపత్రికను విడుదల చేస్తున్న నాయకుల

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకేఎస్) రైతన్న డైరీ, రైతు లోకం మాసపత్రికను బుధవారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు గోరుకల్లు అంజిత్‌గౌడ్, భీమన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో సభ్యత్వం వసూలు చేసి రైతు సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. హర్యానాలోని ఖనౌరి సరిహద్దు వద్ద 52 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకులు జగ్జిత్ సింగ్ దాలేవాల్‌కు సంఘీభావంగా అన్ని గ్రామాలు తిరిగి రైతులతో మమేకమై వామపక్ష పార్టీ రైతు సంఘాలతో కలిసి ఈనెల 26వ తేదీన మోటార్ సైకిళ్లు, ట్రాక్టర్లు ర్యాలీతో నిరసన చేపట్టాలని రైతులకు పిలుపునిచ్చారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీపీఐ జిల్లా సమితి సభ్యులు వీరేష్, హనుమన్న, రైతు సంఘం నాయకులు, బసాపురం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి

ఆదోని రూరల్: మండలంలోని మండిగిరి గ్రామ పంచాయతీ తిరుమలనగర్ హంసగార్డెన్ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు బుధవారం ఎమ్మెల్యే పార్థసారథికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాగునీటి కోసం రోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని, సమస్య ను తక్షణమే పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేను అభ్యర్థించారు.సంబంధిత అధికారులతో చర్చించి త్వరలో నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కార్మికులకు సూచించారు. ఆయన బుధవారం స్థానిక సోమప్ప సర్కిల్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని కార్మికులను ఆదేశించారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో భోజన పంపిణీని తనిఖీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వైభవంగా నరహరి తీర్థుల ఆరాధన



నరహరి తీర్థులకు హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: మధ్వ మత పూర్వపు పీఠాధిపతి నరహరి తీర్థుల ఆరాధన వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం కర్ణాటక రాష్ట్రం హంపిలోని నరహరి మఠంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో నరహరి తీర్థుల ఉత్తరారాధన చేపట్టారు. శాస్త్రోక్తంగా అర్చకుల వేద మంత్రోచ్చరణ మధ్య వేడుకలు వైభవంగా గావించారు. మంగళవారం ధార్వాడ హైకోర్టు ద్విసభ్య కమిటీ నరహరి తీర్థుల ఆరాధనకు శ్రీమఠానికి అనుమతులు ఇవ్వడంతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. గతంలో ఉత్తరాధి మఠం ఆధ్వర్యంలో ఇక్కడ వేడుకలు జరిగాయి.

•హెల్త్ పింఛనుదారులపై పగ!



బుద్ధిమాంద్యం గల వైష్ణవిని ఎత్తుకొని శిబిరానికి తీసుకొస్తున్న మామ హీరాలాల్, పక్కనే తల్లి జమునాబాయి

ఆరోగ్య పింఛన్ పొందుతున్న వారిపై కూటమి సర్కారు పగబట్టింది. ఏళ్ల తరబడి మంచానికి పరిమితమై ప్రభుత్వం నుంచి పింఛను పొందుతున్న వారు శిబిరానికి హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకుని అర్హత నిరూపించుకోవా లని ఆదేశించడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారు.పలువురు దోగాడుతూ, పడు తూ లేస్తూ, మరికొందరు సహాయకుల ద్వారా వ్యయప్రయాసలు పడుతూ ఆస్పత్రికి చేరుకుంటున్నారు. ఇదిలాఉండగా ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రెండో రోజు బుధవారం సదరం క్యాంప్ జరిగింది. వైద్య శిబిరంలో ఆదోనితో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన చెవిటి, మూగ, కంటి వ్యాధిగ్రస్తులు శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి హాజరైన పింఛన్‌దారులకు వైద్య పరీక్షలు చేసి, వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. నంద్యాల నుంచి ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకోవడం కష్టంతో కూడుకున్న పని అని, కర్నూలు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి ఉంటే కాస్త సౌకర్యంగా ఉండేదని బాధిత పింఛన్‌దారుల తల్లిదండ్రులు, బంధువులు వాపోయారు. దాదాపు 150 కి.మీ దూరంలో ఉన్న ఆదోనికి బుద్ధిమాంద్యం, వికలత్వం కలిగిన వారిని తీసుకొచ్చి పరీక్షలు చేయించుకుని తిరిగి వెళ్లేందుకు వ్యయప్రయాసలను ఎదుర్కొన్నామని వాపోయారు. పింఛన్ల సంఖ్యను తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను పలువురు దుయ్యబట్టారు.

– ఆదోనిటౌన్

విద్యార్థులను చదువుకు దూరం చేయొద్దు



పల్లెపాడులో వలస వెళుతున్న వారితో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరురూరల్: వలసలు వెళ్లేవారు విద్యార్థులను తమ వెంట తీసుకెళ్లి వారిని చదువులకు దూరం చేయవద్దని ఎంపీపీ స్కూల్ హెచ్ఎం శాంతిరాజు కోరారు. ఆయన బుధవారం మండల పరిధిలోని మాసుమాన్‌దొడ్డి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను సక్రమంగా బడికి పంపాలని కోరారు. బడిమానేసిన మహేంద్ర అనే 7వ తరగతి విద్యార్థి తల్లి చనిపోగా తండ్రి పట్టించుకోకపోవడంతో పెదనాన్న తన వద్ద పెట్టుకొని బడికి పంపుతానని ఉపాధ్యాయులకు చెప్పడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

గోనెగండ్ల: చదువుకునే పిల్లలను వలసకు తీసుకెళితే వారి చదువు పాడవుతుందని ఎంఈఓ–2 నీలకంఠ అన్నారు. బుధవారం మండలంలోని గోనెగండ్ల, పెద్దమరివీడు తదితర గ్రామాల్లో ప్రజలకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. వలస వెళ్లే తల్లిదండ్రులు పిల్లలను వెంట తీసుకెళ్లడం వల్ల వారు చదువులో వెనకబడటం, హాజరు తగ్గడం వల్ల ప్రభుత్వ పథకాలు అందకుండా పోతాయన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కోసిగి: చదువుకునే పిల్లలను వలస బాటన తీసుకెళ్ల వద్దని పల్లెపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం దస్తగిరి, ఉపాధ్యాయులు కోరారు. మంగళ, బుధవారాల్లో ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను వలస తీసుకెళ్లి వారి జీవితాలు నాశనం చేయవద్దని సూచించారు.

కౌతాళం: వలస వెళ్లే తల్లిదండ్రులు పిల్లలను వెంట తీసుకెళ్లకుండా నచ్చజెప్పినట్లు ఎంఈఓ శోభరాణి తెలిపారు. మండల పరిధిలోని కాత్రికి, నదిచాగి, లింగాలదిన్నె, బాపురం, దంబలదిన్నె, ఎరిగేరి, సుళేకేరి, పొదలకుంట గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

పెద్దకడబూరు: స్థానిక బస్టాండ్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు తదితర రద్దీ ప్రాంతాలలో మెయిన్ పాఠశాల ఉపాధ్యాయులు నరసింహులు, కేశవ, ఐఈఆర్టీ గోపాల్ మైక్ ద్వారా ప్రజలకు అవగాహన చేపట్టారు. పిల్లలను వలస తీసుకెళ్లి వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని సూచించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఎమ్మిగనూరుటౌన్/ ఆదోని టౌన్: : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన జారీ చేసింది. ఇందులో యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా మున్సిపల్ వైస్ చైర్మన్ డి.నజీర్‌అహమ్మద్‌ను, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా చైర్మన్ డాక్టర్ కేఎస్.రఘును నియమించారు అలాగే మహిళా విభాగం – పి.దీవెన, రైతు విభాగం – కె.వెంకటేశ్వర్‌రెడ్డి, బీసీ సెల్ – టి.మురళీనాయుడు, ఎస్సీ సెల్ – ఎం.శాంతిరాజు, మైనారిటీ సెల్ – కె.ఖాశీంబేగ్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ – గంజిలయ్య, విద్యార్థి విభాగం – జి.బలరాంయాదవ్, పంచాయతీరాజ్ విభాగం – కె.మోహన్‌రెడ్డి, మున్సిపల్ విభాగం – బోడ శ్రావణి, ఆర్‌టీఐ విభాగం ఎ.రాజాశరత్‌కుమార్, వలంటీర్ విభాగం – షేక్ బాబులాల్, గ్రీవెన్స్ సెల్ – విశ్వనాథ్‌రమేష్, వాణిజ్య విభాగం – యూకే రమేష్, వీవర్స్ విభాగం – మీసాల నీలకంఠప్ప, వైఎస్సార్‌టీయూసీ – ఎం. ఆంజినేయులు, అంగన్‌వాడీ విభాగం – కె.సరస్వతి, లీగల్ సెల్ – ఎంకే గురురాజారావు, సాంస్కృతికం – ఆర్. వెంకట్రామిరెడ్డి, సోషల్ విభాగం – ఎండీ షరీఫ్, ఐటీ వింగ్ – మాచాని సోమేష్, దివ్యాంగుల విభాగం – జి.లక్ష్మినారాయణ, పబ్లిసిటీ – ఎం. చాంద్‌బాషా, ఇంటలెక్చువల్స్ ఫోరం – బి.పెద్దఈరన్న, బూత్‌కమిటీ విభాగం – కె.రంగస్వామిని నియమించారు. ఆయా విభాగాలకు అధ్యక్షులుగా ఎంపికైన వారు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఆదోని నియోజకవర్గంలో..

యూత్ వింగ్ అధ్యక్షులుగా హెచ్.నల్లారెడ్డి, మహిళా విభాగం – దేవిశెట్టి మంజుల, రైతు విభాగం – గొల్ల ఎరిషా,బీసీ సెల్– కె.భాస్కర్,ఎస్సీ సెల్ – యేసేబు, ఎస్టీ సెల్ – ఎరుకల రమేష్, మైనార్టీ సెల్ – ముల్లా మహమ్మద్ యాసీమ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్– కందుకూరి చిరంజీవి, స్టూడెంట్ వింగ్ –పింజరి ఈషాక్, పంచాయతీరాజ్ వింగ్ – గొల్ల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వింగ్ – సందిపోగు అశోక్, ఆర్‌టీఐ వింగ్ – బి.శ్రీనివాస్, వలంటీర్స్ వింగ్ – పి.మహబూబ్ బాషా, గ్రీవెన్స్ సెల్ – బండి తాహెర్‌బాసా, వాణిజ్య విభాగం – గడిగ రాందాస్, వీవర్స్ వింగ్ – ఎం.గోవిందరాజ్,వైఎస్సార్‌టీయూసీ – షేక్ సుల్తాన్‌బాషా, అంగన్‌వాడీ వింగ్ –ఎరుకల లక్ష్మి, లీగల్ సెల్ – హంపి నాగరాజ్, కల్చరల్ వింగ్ – బోయ ప్రతిభ, సోషల్ మీడియా వింగ్– ఎస్.కె.పంపారెడ్డి, ఐటీ వింగ్ – ఎం.వినయ్, దివ్యాంగుల విభాగం – పీకలగట్టు హనుమంతరెడ్డి, పబ్లిసిటీ వింగ్ – సోమలగుడూరు నారాయణ, ఇంటలెక్చువల్ ఫోరం – ఉప్పర గిరిరాజు, బూత్ కమిటీస్ వింగ్ – చికలపర్వి చలపతిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అధ్వానంగా గంజిహళ్లి రోడ్డు



గుంతలు పడిన గంజిహళ్లి రోడ్డు

గోనెగండ్ల: మండల కేంద్రం నుంచి గంజిహళ్లి గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారి అధ్వానంగా ఉందని జనసేన నాయకులు గానిగ బాషా, మాలిక్ అన్నారు. బుధవారం జనసేన నాయకులు ఆ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోనెగండ్ల నుంచి గంజిహళ్లి మీదుగా బైలుప్పల, బి.అగ్రహారం తదితర గ్రామాలకు ఈ దారిలోనే వెళ్లాల్సి ఉందని, అయితే గంజిహళ్లి రోడ్డుకు వెళ్లే కాలనీలో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తోందన్నారు. దీంతో రోడ్డుపై గుంతలు పడి అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుతో పాటు డ్రైనేజీలను నిర్మించాలని కోరారు.